# బ్లడ్ షెడ్

— శాంతారామ్

ఓ పది నిముషాలు కళ్ళుమూసుకొంటే వచ్చే ఆ మూడువందలగురించి ఆలోచిస్తూ అతను ఆస్పత్రి సింహద్వారంలో అడుగుపెట్టాడు.

ఆస్పత్రి దీనంగా ఉంది. మెటర్నిటీ వార్డుల్లో పసికందుల సవ్వడులు తప్పిస్తే ఆస్పత్రులన్నీ దీనంగానే ఉంటాయి.

అతనికి మాత్రం ఆస్పత్రి భయం కలిగించదు. ఆస్పత్రి ద్వారం అన్నం ముద్ద అందించే చెయ్యిలా ఉంటుంది. నింపాదిగా బ్లడ్ డొనేషన్ వార్డులోకి వెళ్ళాడు.

తరచుగా అక్కడే తచ్చాడే అతనికి ఇద్దరు నర్సులు బాగా తెలుసు. నల్లగా ఎత్తుగా గద్దముక్కుతో ఉండే నర్సంటే అతనికి కంపరం. తెల్లగా పొట్టిగా బొద్దుగా ఉండే కుర్రనర్సుని చూస్తే అతనికి పచ్చటి చెట్లమధ్య నిద్రపోతున్నా నన్న అనుభూతి కలుగుతుంది.

రక్తం అమ్ముకోడానికి ఆస్పత్రికి వచ్చినప్పుడల్లా ఆ బొద్దు నర్సు ఉంటే ఎంత బావుణ్ణు అని అతను గేటులోనే అనుకొంటాడు.

వార్డులోకి తొంగిచూసిన అతనికి ఆమే కన్పించింది!

వరండాలో అతన్ని చూసిన ఆ నర్సు ముఖం చిట్లించింది.

అతను 'ఓ' బ్లడ్ గ్రూపు వాడు. అందర్నీ ఎంతగా కసురుకొనే ఆస్పత్రి అయినా అతన్ని అక్కున చేర్చుకుని రక్త పిండేసుకుంటుంది.

అందుకే అతను చాలా ధీమాగా ఉంటాడు. రక్తం అమ్ముకొనే మొదటి రోజుల్లో మరీ ధీమాగా ఉండేవాడు. ఇప్పుడిప్పుడే నరాలు అతని పట్టు తప్పుతున్నాయి.

బొద్దుగా ఉండే నర్సు తనలాటి వాళ్ళని చూసి అలా చిట్లించుకోవడం మామూలే. అలా అసహ్యంగా ఆమె ముఖం పెట్టుకొన్నప్పుడే ఎంతో బాగుంటుందని అత ననుకొంటాడు.

రక్తం అమ్ముకొనేవాళ్ళగురించి ఆమె తేలిగ్గా మాట్లాడ్డం అతను చాలాసార్లు వినిఉన్నాడు.

ఆ రోజు. తనబోటివాళ్ళెవ్వరూ రాలేదు నర్సు సైగచేస్తే వరండాలో బెడ్ మీద వెల్లకిలా పడుకున్నాడు. కుడి చేతిని ఒకసారి నిమురుకుని, నరాలకు జరగబోయే తంతు గురించి సంకేతం పంపుకున్నాడు.




మరో ఐదు నిముషాలకి అతని నరాల నుంచి సీసాలోకి రక్తం పోవడానికి మార్గం సుగమం అయింది. యాంత్రికంగా లింకు కలిపిన నర్సు పక్కవార్డు పచార్లకు వెళ్ళింది.

సీసా ఉన్నది ఏసీ రూములో అతను పడుకున్నది వరండాలో. వడగాలులు కసిరికొట్టే వరండాలో.

సీసాలోకి రక్తం నెమ్మదిగా ప్రవహిస్తోంది. ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది నిముషాలు గడిచాయి. అతని కుడిచేతి నరం పోటు పెడుతోంది. శరీరంలోకి కర్కశంగా దిగిన సూది మరింత పైశాచికంగా బాధిస్తోంది.

మూడువందలు ఎన్నిరోజులొస్తాయో అతను లెక్కేసుకొంటున్నాడు. ప్రపంచానికి ఇంత రక్తం అవసరమైనందుకు కృతజ్ఞతలు చెప్పుకొంటున్నాడు. నువ్వు ఇంకెంతోకాలం అమ్ముకోలేవు అని హెచ్చరిస్తున్న మనసుని కసిరికొడుతున్నాడు. అతను నీరసాన్ని జయించాలని ప్రయత్నిస్తున్నాడు.

పక్కవార్డులో కెళ్ళిన బొద్దునర్సు మరో నర్సుతో సాగిస్తున్న ముచ్చట్లు అతని చెవులకు లీలగా సోకుతున్నాయి. బొద్దునర్సు ఎందుకో గట్టిగా నవ్వినచప్పుడు కూడా విన్పించింది.

పది నిముషాలు గడిచిపోయాయి. అతని కళ్ళు తిరిగిపోతున్నాయి. అతని అనుమానం బలపడిపోయింది. తనదగ్గర ఇంకెంతో రక్తం లేదు. నరాలు చాలా వరకు చచ్చుబడిపోయాయి. అంతకు ముందు పది నిముషాలలో పే సీసా నిండేది.

మరి ఇప్పుడిదేమిటి?

తను మరోసారి రక్తం అమ్ముకోలేడా? ఈ ఆలోచన అతన్ని మరింత పీల్చి పిప్పిచేస్తోంది.

మరో ఐదునిముషాల తర్వాత నర్సు వచ్చింది. అతను బలవంతంమీద కళ్లు తెరిచి నీరసంగా ఆమెవైపు చూశాడు.

'మేడం, నా దగ్గర ఇంకెంతో రక్తం

లేదు కదూ' నీరసపు మాటలు అస్పష్టంగా ఉన్నాయి.

నర్సు అతనివైపు ఓసారి యధాలాపంగా చూసి ఏసీరూములోకెళ్ళింది.

అతని చేతికి డబ్బు రావడానికి మరో అరగంట పట్టింది.

డబ్బు లెక్కబెట్టుకొన్న అతను ఆశ్చర్యపోయాడు.

ఎప్పటిలా ఇచ్చే మూడొందలు కాక మరో వందరూపాయలు అదనంగా వచ్చాయి.

అతను బొద్దునర్సువైపు చూశాడు. తన పరిస్థితిని చూసి కరిగిపోతున్న పాలరాతి శిల్పంలా అతని నీరసపు కళ్ళకి కన్పించింది.

వందరూపాయలు ఎందుకు ఎక్కువిచ్చారని అతను ఆమెను అడగలేక పోయాడు. అభిమానం నిండిన కళ్ళతో ఆమెవైపు మరోసారి చూడలేకపోయాడు.

మళ్ళీ అస్పత్రికి వస్తానో రానో అను కొంటూ అతను గేటు దాటిపోయాడు.

*     *     *

అటూ ఇటూ చూసి గబగబా ఏసీ రూములోకెళ్ళిన నర్సు మరో ఐదు నిముషాల తర్వాత హాయిగా ఊపిరి తీసుకొని బయటకి వచ్చింది. అతని రక్తంతో సీసా నిండిపోగా మరో సీసాడు రక్తం నేలమీద ధారకట్టడం ఎవరూ చూడనందుకు ఆమె కెంతో సంతోషంగా ఉంది.

---

## వచ్చేసంచికలో

### గడ్డిపూలు నవల

రచన: భట్టిప్రోలు కృష్ణమూర్తి

---